క్లుప్తంగా

'గంజాయి సాగుచేస్తే పథకాలు నిలిపివేత'



మాట్లాడుతున్న ఏఈవో సంజీవ్‌నాయక్

ఇచ్చోడ: గంజాయి సాగు చేసే రైతులకు భవిష్యత్‌లో ప్రభుత్వం నుంచే వచ్చే పథకాలను నిలిపివేయనున్నట్లు ఏఈవో సంజీవ్ నాయక్ తెలిపారు. ఆదివారం మండలంలోని గుబ్బ గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గంజాయి సాగు చేయడాన్ని ప్రభుత్వం నిషేధించిందన్నారు. పత్తి, ఇతర పంటలలో గంజాయి సాగు చేసి కేసుల పాలు కావద్దన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ భీంరావు, రైతులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఫొటోగ్రాఫర్లు



హైదరాబాద్ తరలుతున్న ఫొటోగ్రాఫర్లు

బోథ్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రాఫర్ల సంఘం ఎన్నిక సందర్భంగా జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు ఓటుహక్కు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో బూస లక్ష్మణ్, కాడెరుగుల గణేష్, నోముల కుషాల్ రెడ్డి, జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్లు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శంకర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్న రావుల శంకర దంపతులను ఉపాధ్యాయులు అప్పాల శ్రీనివాస్ రెడ్డి, భవాని ఆనంద్‌లు ఆదివారం శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు చేసిన సేవలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు దక్కడం సంతోషకరమని అన్నారు.

బాల మేధావికి సన్మానం



బాలుడిని సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడకు చెందిన నాలుగున్నరేళ్ల సాయి లోహిత్‌ను స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇటీవల ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్ ద్వారా గోల్డ్ మెడల్ అందుకున్నాడు. అంతరిక్షంలోని గ్రహాల పేర్లు, సప్త వర్ణాలు, సముద్రాల పేర్లు, రంగులు, వింతలు, శాస్త్రవేత్తలు, దేశాల పేర్లు, నదులు తదితర వాటి గురించి అడిగిన వెంటనే సమాధానాలు చెబుతాడు. ఇందుకు గాను ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించగా, ఈ బాలుడికి మెడల్ లభించింది. కార్యక్రమంలో సభ్యులు శ్రీకాంత్, సురేశ్, రామకృష్ణ, దత్తు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డు నిర్మాణం



నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డు

నార్నూర్: మండలంలోని మలేపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్తగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడంతో మూడు వారాలుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల గ్రామ పర్యటనకు వెళ్లిన ఎంపీడీవో జవహర్, ఎంపీవో స్వప్నశీల దృష్టికి ఈ విషయాన్ని గ్రామస్తులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో తక్షణమే తాత్కాలిక మట్టి రోడ్డు వేయించి గ్రామానికి రాకపోకలు పునరుద్ధరించారు.

వాహనాలు తనిఖీ

లోకేశ్వరం: మద్యం సేవించి నడిపితే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఏఎస్సై దిగంబర్ అన్నారు. ఆదివారం మండలంలోని పంచగుడిలో వంతెన వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏఎస్సై మాట్లాడుతూ తమ వెంట ధ్రువపత్రాలను ఉంచుకోవాలని పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

- సామాజిక తనిఖీలో వెలుగులోకి..
- కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ

ఆదిలాబాద్‌రూరల్: వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే వ్యవసాయ కూలీ పనులు లభిస్తాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి కూలీలు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం 2006 సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఒకజాబ్ కార్డుకు 100 రోజుల పని దినాలు కల్పించాల్సి ఉంటుంది. అయితే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని 34 గ్రామ పంచాయతీలలో 11,313 జాబ్‌కార్డులు ఉండగా.. ఇందులో 22,806 మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ ఉన్న కార్డులు 8,246 ఉండగా 15,080 మంది కూలీలు పనులకు వెళ్తున్నట్లు అధికారుల రికార్డులు పేర్కొంటున్నాయి.

అక్రమాలు వెలుగులోకి..

2023- 24 ఆర్థిక సంవత్సరంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలో 4.68 కోట్ల విలువ చేసే 666 పనులు చేపట్టారు. వీటిపై శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయా పనులపై రాత్రి వరకు 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అయితే మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధిహామీ కూలీల నుంచి రూ. 1.11 లక్షలు వసూలు చేసినట్లు తేలింది. దీంతో ఆయనను అధికారులు విధుల నుంచి తొలగించారు. ఉపాధి హామీ పనుల్లో కొన్ని వెలుగులోకి రాకుండా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు కూలీలు వాపోతున్నారు.

చిన్నపాటి పొరపాట్లు జరిగాయి

2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ. 4.68 కోట్ల విలువ చేసే పనులు చేపట్టాం. వాటిపై శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో చిన్నపాటి పొరపాట్లు జరిగినట్లు తనిఖీ బృందం అధికారులు గుర్తించారు.

– జాకీర్ హుస్సేన్, ఏపీవో, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆదిలాబాద్ రూరల్

పట్టించుకునే వారే కరువు..

కూలీలు పనులకు వెళ్లకున్న వెళ్లినట్లు కొంత మంది ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు రికార్డులు నమోదు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. అందులో కొన్ని కూలీకి డబ్బులు అందజేస్తుండగా మరికొన్ని ఫీల్డ్ అసిస్టెంట్ ఉంచుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కొన్ని చోట్ల అక్రమాలు వెలుగులోకి రావడంతో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు కూలీలు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలోని మండలం ఉపాధిహామీ పథకం పనుల దుస్థితి ఇలా ఉంటే మారుమూల గిరిజన ప్రాంతాలలోని మండలాల పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు పేర్కొంటున్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా వెనుకబాటులో ఉన్న గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని అటవీ ప్రాంతంలో రోడ్డు, రవాణా సౌకర్యం లేని నక్సల్ ప్రభావిత డేడ్ర, మాన్కపూర్ గ్రామాల్లో పర్యటించారు. డేడ్ర గ్రామంలో బాలవికాస్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 70 ఏళ్లుగా ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఎలాంటి రోడ్డు మార్గం, రవాణా సౌకర్యంలేక గిరిజన బిడ్డలు విద్య, వైద్యానికి దూరమయ్యారని తెలిపారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్నా.. గిరిజనుల తలరాతలు మారడం లేదన్నారు. ఆరు నెలల్లో అటవీశాఖ అనుమతులు తీసుకుని బీటీరోడ్ల నిర్మాణం ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని అటవీ ప్రాంతంలో భూతాయి(కె) గ్రామం నుంచి డేడ్ర వరకు రూ.1.75 కోట్లు, మాన్కపూర్‌కు రూ.1.55 కోట్లు, గిరిజాయికి రూ.1.10 కోట్లు. భూతాయి(కెకే) నుంచి ఉమర్దా వరకు 3.77 కోట్లుతో బీటీరోడ్ల నిర్మాణానికి ఐటీడీఏ నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని ప్రతిఇంటికీ అందించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ లింగుపటేల్, మాజీ సర్పంచ్‌లు ప్రియాంక అనిల్, భీంరావ్, తిరుమల్‌గౌడ్, గోలార్ అర్జున్, విద్యాసాగరా, మాజీ ఎంపీపీ సజన్, మాజీ ఎంపీటీసీ లక్ష్మిచందు, కానిందే రాజారాం, చిల్కూరి భూమన్న, కవిందర్, లక్ష్మణ్ మాట్లాడారు.

కాంగ్రెస్ విధానాలు నచ్చకే బీఆర్‌ఎస్‌లోకి..

బోథ్: కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, ఆ పార్టీ విధానాలు నచ్చక కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షురాలు అనితబాయి, మట్ట చందర్‌లు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పవార్ ప్రకాష్ సింగ్, నానాక్ సింగ్, బాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

బోథ్: నిర్మల్ జిల్లా కేంద్రంలో చుక్క ధర్మరాజు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో బోథ్ మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే కటాస్ అనే విభాగంలో 8 గోల్డ్ మెడల్, ఆరు సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని కరాటే మాస్టర్లు మాస్టర్ రాజు, అనూష, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు అభినందించారు.

1న జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-14, 17 బాల, బాలికల జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2008 అనంతరం జన్మించిన వారు 17 సంవత్సరాల విభాగంలో, జనవరి ఒకటి 2011 అనంతరం జన్మించిన వారు 14 సంవత్సరాల విభాగంలో పోటీ పడడానికి అర్హులన్నారు. అర్హులైన క్రీడాకారులు బోనాఫైడ్ ధ్రువపత్రంతో ఉదయం 10 గంటలకు జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముఖేష్ కుమార్, ప్రవీణ్ కుమార్లకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

'బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు'



నినాదాలు చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేంత వరకు పోరాడుతామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట బీసీ జనసభ, బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుల జనగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలు నేరవేర్చడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు బీసీల ఓట్లు కావాలి.. పదవులు మాత్రం వద్దాని ప్రశ్నించారు. బీసీల ఓట్లు కొల్లగొట్టడం కోసమే సీఎం చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రవికిరణ్ యాదవ్, మేకల కృష్ణ, వేణు కుమార్, గంజెంద్, నారాయణ, హన్మండ్లు యాదవ్, ఈర్ల సత్యనారాయణ, పార్థ సారథి, అన్నదానం జగదీష్, రఘు వీర్ యాదవ్, వేణు యాదవ్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న పతాంగే బ్రహ్మానంద్

బజార్‌హత్నూర్: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్ తెలిపారు. ఆదివారం మండలంలోని పిప్రి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో దేశం సురక్షితంగా ఉందని, ఆర్థికాభివృద్ధిలో ప్రపంచంలో ఐదో స్థానంలో ఉన్నామని, త్వరలో మూడో స్థానానికి చేరుకుంటామని ఇదంతా బీజేపీ ప్రభుత్వంతో, ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమైందన్నారు. దేశంలో యువత, ఉద్యోగులు, కర్షకులు, కార్మికులంత బీజేపీతోనే ఉన్నారని తెలిపారు. భవిష్యత్‌లో దేశం ఇంకా ఉన్నతంగా ఎదగాలంటే అందరు బీజేపీ సభ్యత్వం తీసుకుని మోదీకి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోరెడ్డి, శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, నానాం రమణ, కొత్త శంకర్, చట్ల ఉత్తం, పండగ మురళీమోహన్, ఆమ్టే, బాబారావ్, రమణ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశం సురక్షితం

బోథ్: బీజేపీతోనే దేశం సురక్షితంగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానందం అన్నారు. ఆదివారం మండలంలోని సొనాల గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఆన్‌లైన్‌లో బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం గ్రామంలో కచ్చకాయల హరీష్ ఇంట్లో ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జీవీ రమణ, సుభాష్ సూర్య, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్, తుకారాం, మానాల శేఖర్, రంజిత్ సింగ్, హరీష్, సూర్యం, కార్తీక్, రాజేశ్వర్, జుగాది రావ్, పోతన్న, రమేశ్ పాల్గొన్నారు.

'హైడ్రా బల్దియాకు వర్తించదు'



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు నగేశ్

ఎదులాపురం: హైడ్రా చట్టం హైదరాబాద్‌కు వర్తిస్తుందని, మున్సిపల్ పరిధిలోని ఖానాపూర్ చెరువును ఆనుకుని నివాసం ఉంటున్న స్థానిక ప్రజలు ఈవిషయంలో ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. దీన్ని స్థానికులు గుర్తించాలన్నారు. తమ పార్టీ కూడు, గూడు, నీడ అనే నినాదంతో పని చేస్తుందన్నారు. మున్ముందు ఎలాంటి నిర్మాణాలు జరగకుండా, ఇప్పటి వరకు ఉన్న ఇండ్ల వివరాలను సర్వే ద్వారా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా బీఆర్‌ఎస్, బీజేపీలు దీన్ని రాజకీయం చేస్తూ ప్రజలను తప్పుతోవ పట్టించే కుట్ర చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజలు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షకీల్, అలీం, మహేందర్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ నుంచి ఆస్పత్రికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఏర్పాటు చేసే ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని మాజీ ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యుడు అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మున్సిపల్ చైర్మన్ చొరవతో రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి.. 108 అంబులెన్సు వెళ్లేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. మళ్లీ యథావిధిగా దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య సృష్టిస్తున్నారని.. సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు.

బోటు షికారు..



కడెం: కడెం ప్రాజెక్టును ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందర్శించారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

నేడు గంగనీళ్ల జాతర ఏర్పాట్లపై సమీక్ష

సారంగాపూర్: నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద ఆయా శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఈఓ రమేశ్ తెలిపారు. ఈకార్యక్రమానికి ఆర్టీసీ, వైద్యం, పోలీస్ అధికారులతోపాటు ఆయా గ్రామాల నాయకులు హాజరు కావాలని కోరారు. జాతర ఏర్పాట్లు, అవసరమైన భద్రత, భక్తులకు రవాణా సౌకర్యం, పార్కింగ్, వైద్యశిబిరం ఏర్పాట్లు తదితర అంశాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

మున్నూరుకాపు మిత్రమండలి ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

భైంసాటౌన్: మున్నూరుకాపు మిత్రమండలి భైంసా పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోర్బగల్లిలోని సంఘ భవనంలో అధ్యక్షుడిగా గాలి రవి, ప్రధాన కార్యదర్శిగా పెద్దకాపు గజ్జారాం, కోశాధికారిగా కార్గం వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రావుల పోశెట్టి, సంయుక్త కార్యదర్శిగా బొందెల శంకర్, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలమాలతో సత్కరించారు.

జ్యోతిబా పూలే స్ఫూర్తితో పోరాటం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జగన్‌సింగ్

ఎదులాపురం: మహాత్మా జ్యోతిబా పూలే స్ఫూర్తితో కుల నిర్మూలనకు పోరాడుతామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మహాత్మ జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ 151వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కులనిర్మూలన సదస్సు ఏర్పాటు చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయిల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి జగన్ మాట్లాడుతూ కుల నిర్మూలన కోసం జ్యోతిబా పూలే సత్యశోధక్ సంస్థను స్థాపించడం జరిగిందన్నారు. సంస్థ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమించి ప్రజల మధ్య ఐక్యతను తీసుకువచ్చే ప్రయత్నం చేశారన్నారు. సమానత్వ భావనలను సమాజంలోకి తీసుకువెళ్లిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సురేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, అశోక్, తారాబాయి, ఐఎఫ్‌టీయూ నాయకులు మనోజ్, శత్రుఘ్న, బుచ్చిరాం, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆదిలాబాద్‌రూరల్: సాంగిడి గ్రామానికి చెందిన ప్రభుత్వం పాఠశాల 2004– 2005 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మావలలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆర్థికంగా వెనకబడిన మిత్రులను ఆదుకునేందుకు కొంత నగదు జమచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సామ రూపేష్ రెడ్డి, నగేశ్, జైపాల్, నవనీత్ రెడ్డి, అరుణ్, అమరేందర్ రెడ్డి, దీపక్, అనిల్, గణేష్, కవిత, శరణ్య, శాలినిరెడ్డి, లలిత, మనిషా, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోతకు గురైన చిత్తగూడ రోడ్డు



ప్రమాదకరంగా తోయగూడ రోడ్డు

గాదిగూడ మండలంలోని ఆర్మీయాన్ నుంచి చిత్తగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టులు, వంతెనలు కోతకు గురయ్యాయి. తారురోడ్డు కొట్టుకుపోయి భారీ గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మండలవాసులు కోరుతున్నారు.

– నార్నూర్

రోడ్డును తవ్విన గుర్తుతెలియని వ్యక్తులు



రోడ్డును అడ్డంగా తవ్విన దృశ్యం

బోథ్: మండలంలోని సొనాల గ్రామం నుంచి చింతలబోరి గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును సొనాల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అడ్డంగా తవ్వారు. మూడు చోట్ల తవ్వడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సొనాల గ్రామానికి నిత్యం వందల మంది వివిధ గ్రామాలకు వస్తుంటారని, ఇలా రోడ్డును తవ్వడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తవ్విన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు.